జంక్షన్ల సుందరీకరణకు మోక్షమెప్పుడో?



నాంపల్లి చౌరస్తా



తిప్పాపూర్‌లోని తెలంగాణ చౌక్ వద్ద ట్రాఫిక్ జాం

- చౌరస్తాల వద్ద తరచూ ప్రమాదాలు
- ట్రాఫిక్ జాంతో ప్రయాణికుల ఇబ్బంది
- పట్టించుకోని అధికారులు

వేములవాడఅర్బన్: దక్షిణకాశీగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి పుణ్యక్షేత్రానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు నిత్యం వాహనాల మీద తరలిస్తుంటారు. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారుల్లో చౌరస్తాలు ప్రమాదకరంగా మారాయి. ఏ వాహనం ఎటు వెళ్తుందో తెలియక తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు పట్టించుకోని చౌరస్తాల్లో జంక్షన్ల సుందరీకరణ పనులు ప్రారంభించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి పాత గ్రామ పంచాయతీ చోట చౌరస్తా వద్ద మూడు దారుల నుంచి వాహనాలు వేగంగా రావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ చౌరస్తా వద్ద పెద్ద జంక్షన్ ఏర్పాటు చేస్తే ఇబ్బందులు తీరుతాయని స్థానికులు తెలుపుతున్నారు.

నాలుగు దారులు ఒకే చోట..
వేములవాడ మున్సిపల్ పరిధి తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద నాలుగు రహదారుల నుంచి వచ్చే వాహనలు ఒకేచోట కలుస్తుంటాయి. ఈ చౌరస్తా ఇరుకుగా ఉండటంతో రోజూ ట్రాఫిక్ జామ్ అవుతోంది. తిప్పాపూర్ తెలంగాణ చౌక్ వద్ద కరీంనగర్ – సిరిసిల్ల– వేములవాడ – వేములవాడ ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే బస్సులు నాలుగు రహదారులు ఒకే చోట కలుస్తున్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద జంక్షన్ సుందరీకరణ చేస్తే ట్రాఫిక్ జామ్ కాకుండా ఉంటుందని పలువురు తెలుపుతున్నారు. వేములవాడ పట్టణం, రాజన్న క్షేత్రానికి చేరుకోవాలంటే తిప్పాపూర్ తెలంగాణ చౌక్ నుంచి వెళ్లాలి. కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, కామారెడ్డి, సిరిసిల్ల నుంచి వచ్చే ప్రతి వాహనం ఇక్కడి నుంచి వెళ్లాల్సి ఉంటుంది. ప్రభుత్వం, అధికారులు పట్టించుకొని ఈ తిప్పాపూర్ చౌరస్తా వద్ద పెద్దఎత్తున జంక్షన్ సుందరీకరణ ప్రారంభించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నాయి



నాంపల్లి పాత గ్రామ పంచాయతీ వద్ద మూడుదారులు కలిసే చౌరస్తా ప్రమాదకరంగా మారింది. ఎటునుంచి వచ్చే వాహనం ఎటు వెళ్తుందో తెలియక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ చౌరస్తా వద్ద జంక్షన్ సుందరీకరణ చేపట్టాలి.

– మేర్గు లక్ష్మణ్, నాంపల్లి

నిత్యం ట్రాఫిక్ జాం



తిప్పాపూర్‌లోని తెలంగాణ చౌరస్తా వద్ద నాలుగు రహదారులు కలిసే చోట ట్రాఫిక్ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇబ్బంది పడుతున్నాం. ఈ చౌరస్తాను విస్తరించి జంక్షన్ సుందరీకరణ పనులు చేపడితే ట్రాఫిక్ జామ్ లేకుండా ఉంటుంది.

– మైలారం వెంకటేశ్, తిప్పాపూర్

మరమ్మతు పనులు పూర్తి చేయాలి



పనుల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

వేములవాడరూరల్: వేసవి సెలవులు ముగిసేలోగా ఆయా పాఠశాలల్లో మరమ్మతు పనులు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద వేములవాడ రూరల్ మండలంలోని వట్టెంల, ఫాజుల్ నగర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో మరమ్మతు పనుల ప్రణాళికను కలెక్టర్ అనురాగ్ జయంతి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయా పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి వసతి, పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నిబంధనల ప్రకారం అమ్మ ఆదర్శ పాఠశాల కింద తరగతి గదులు, మరుగుదొడ్లలో మరమ్మతు పనులు చేయించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తాగునీటి వసతి కల్పించాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆయా శాఖల అధికారులకు కలెక్టర్ సూచించారు. జెడ్పీ సీఈవో ఉమారాణి, డీఈఓ రమేశ్‌కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

‘ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యం’



మాట్లాడుతున్న భేష్‌కుమార్

ముస్తాబాద్: ఎస్సీ వర్గీకరణ బీజేపీతోనే సాధ్యమవుతుందని మాదిగ, మాదిగ ఉపకులాలు బీజేపీకి మద్దతిచ్చి ఆపార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ పసుల భేష్‌కుమార్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో మరోసారి బీజేపీ అధికారంలోకి వస్తుందని, వర్గీకరణకు చట్టబద్ధత కల్పిస్తుందన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థులకు ఓటువేసి గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో నాయకులు బొల్లారం చంద్రమౌళి, కానపూరం లక్ష్మణ్, మంగళి చంద్రమౌళి, నల్ల బాబు, దాసరి కృష్ణంరాజు తదితరులున్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి



ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేటలో ఉపాధి కూలీలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: పార్లమెంట్ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ మండలంలోని బండలింగంపల్లి, కిషన్‌దాస్‌పేట, రాజన్నపేట, అల్మాస్‌పూర్, అక్కపల్లి, వెంకటాపూర్, నారాయణపూర్, ఎల్లారెడ్డిపేట గ్రామాల్లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య వినోద్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ..గత ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక, సెస్ డైరెక్టర్ కృష్ణహరి, సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, కొండ రమేశ్‌గౌడ్, కిషన్, మల్లారెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్, పాల్గొన్నారు.

ముస్తాబాద్: బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ సీనియర్ నాయకుడు కల్వకుంట్ల గోపాల్‌రావు కోరారు. ఆవునూర్, రామలక్ష్మణపల్లె, గూడెం, తుర్కపల్లె గ్రామాల్లో నాయకులు ప్రచారం నిర్వహించారు. ఎంపీపీ శరత్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్, సెస్ మాజీ డైరెక్టర్లు విజయరామారావు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో..



కోనరావుపేట: పల్లిమక్తలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ

కోనరావుపేట: కరీంనగర్ ఎంపీగా బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ కోరారు. మామిడిపల్లిలో ఉపాధిహామీ పనుల వద్దకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

చందుర్తి: మండలంలోని రామన్నపేట, తిమ్మాపూర్‌లో బోయినపల్లి వినోద్‌కుమార్‌కు మద్దతుగా మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ ప్రచారం చేపట్టారు. మాజీ ఎంపీపీ పెంటయ్య, పార్టీ మండల అధ్యక్షుడు మ్యాకల ఎల్లయ్య, మండల కోఆప్షన్ సభ్యులు బత్తుల కమలాకర్, రామన్నపేట మాజీ సర్పంచ్ దుమ్ము అంజయ్య, నాయకులు పోతురాజు తిరుపతి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో పలువురి చేరిక



చందుర్తి: పార్టీలో చేరినవారితో బండి సంజయ్

చందుర్తి : కరీంనగర్ బీజేపీ అభ్యర్థి బండి సంజయ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అల్లాడి రమేశ్ ఆధ్వర్యంలో మండలంలోని మూడపల్లికి చెందిన 50మందికి పైగా మంగళవారం పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల కార్యదర్శిగా పనిచేస్తున్న బొప్ప వెంకన్నలతో పాటు పలువురు పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు, నియోజకవర్గ కన్వీనర్ మార్త సత్తయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, జిల్లా కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, సిర్రం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తంగళ్లపల్లి/ సిరిసిల్ల టౌన్ : ఇల్లంతకుంట మండలంలోని పలువురు మాజీ సర్పంచులు బండి సంజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. ఇటీవల సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు చల్ల నారాయణతోపాటు ముస్కువానిపల్లె, చిక్కుడువానిపల్లె, గూడపల్లె మాజీ సర్పంచులు చేరగా సోమారంపేట మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, రామోజీపేట మాజీసర్పంచ్ మొండయ్య బీజేపీలో చేరారు.

వీర్నపల్లి: మండలంలోని వన్‌పల్లి గర్జనపల్లి గ్రామాల నుంచి సుమారు 20 మంది యువకులు బీజేపీ మండల అధ్యక్షుడు గునుగుల దేవేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం ఆధ్వర్యంలో వేములవాడలో బండి సంజయ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ సమక్షంలో పార్టీలో చేరారు. రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్ గోపి, దేవన్న, పర్శరాములు, కంచెర్ల కేలోత్ గాంగ్యానాయక్, దేశాయ్, గజన్‌లాల్, సంతోష్ శ్రీహరి, నరహరి, భిక్షపతి, శ్రీధర్, రాజేశ్, తిరుపతి, స్వామి, నవీన్, సిరి నాయక్, రమేశ్, తదితరులు పార్టీలో చేరారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



క్రీడాకారులకు టీషర్ట్స్, షీల్డ్‌లు అందజేస్తున్న సంస్థ సభ్యులు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామ యువత నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా మంగళవారం ఫైనల్ మ్యాచ్‌లో మొదటి, రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారులకు ఇంటర్‌నేషనల్ ఓమౌజయ యునైటెడ్ యంగ్ స్టార్స్ అసోషియేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టీషర్ట్స్ పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు పరమో బ్రహ్మశాస్త్రజ్ఞ, త్రిగునాత్మక సిద్ధలు మాట్లాడుతూ.. క్రీడలతో స్నేహభావం పెంపుతోపాటు మానసికోల్లాసానికి దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో సభ్యులు హుస్సేన్ బాషా, వంశీ, రాజేందర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఘనంగా సన్మానం



వేములవాడ: రాజన్న ఆలయంలో పర్యవేక్షకుడిగా విధులు నిర్వహించి మంగళవారం ఉద్యోగ విరమణ పొందిన కే.రాజశేఖర్ దంపతులను ఆలయ ఉద్యోగులు సంఘం నాయకులు ఆయన నివాసంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి కూరగాయల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు సిరిగిరి శ్రీరాములు, ఏఈవో ప్రతాప నవీన్, పర్యవేక్షకుడు గోలి శ్రీనివాస్, వరి నర్సయ్య, అరుణ్, నాగుల మహేశ్, ఎడ్ల శివసాయి తదితరులు పాల్గొన్నారు.

గడ్డి కట్టలు దగ్ధం

తంగళ్లపల్లి: మండలంలోని ఓబులాపూర్ గ్రామంలో రైతు గదపాక తిరుపతికి చెందిన సుమారు 200 గడ్డి కట్టలు ప్రమాదవశాత్తు మంగళవారం దగ్ధమయ్యాయి. విద్యుత్ తీగలు ఒకదానికొకటి తగిలి నిప్పురవ్వలు రావడంతో అగ్నిప్రమాదం జరిగినట్లు తెలిపాడు. అధికారులు ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం.. అగ్రహారం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. వేములవాడ నుంచి సిరిసిల్లకు వెళ్తున్న కారు, బియ్యంలోడుతో ఉన్న ఆటోకు ఎదురుగా వచ్చిన ద్విచక్రవాహనం అగ్రహారం వద్ద ఢీకొంది. ఈ ప్రమాదంలో మారుపాక గ్రామానికి చెందిన గంగరాంకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

మేడేను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

బోయినపల్లి: మేడేను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం మండలకేంద్రంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, రూరల్ మండల కార్యదర్శి శీలం నర్సయ్య, సుతారి సంఘం కార్యదర్శి ఎడపల్లి బాబు, బొడ్డు శ్రీను, ఎడపల్లి రాజు, బొడ్డు దుర్గయ్య, భూమయ్య, వంకాయల రాయల్, సంపత్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..
మండలంలోని దేశాయిపల్లిలో సీఐటీయూ ఆధ్వర్యంలో మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు గురజాల శ్రీధర్, హమాలీ సంఘం అధ్యక్షుడు నాగరాజు, లింగంపల్లి కనుకయ్య, మల్లేశం, హనుమయ్య, మందాల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

‘పది’లో ప్రైవేట్ స్కూళ్ల విద్యార్థుల సత్తా



శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో రమేశ్



రేడియంట్ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

సిరిసిల్లటౌన్: పదో తరగతి సిరిసిల్ల పట్టణ విద్యార్థులు ప్రతిభ చాటారు. అత్యుత్తమ మార్కులు సాధించారు. ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివిన విద్యార్థులు అత్యధిక శాతం 10 జీపీఏ సాధించారు.


‘సిద్ధార్థ’ విద్యార్థుల ప్రభంజనం..
పట్టణంలోని పత్తిపాక, శివనగర్ సిద్ధార్థ ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారు. ఎం.బ్రాహ్మణి, కే. కోమలి, ఆర్. ప్రణతి, ఎం. భవాని 10జీపీఏ, వీరితో పాటు 11మంది 9.8 జీపీఏ, 11మంది 9.8జీపీఏ, 13 మంది 9.5 సాధించారు. పాఠశాలలో వందశాతం ఉత్తీర్ణత సాధించడంపై పాఠశాలల చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, కరస్పాండెంట్ సంతోష్ గౌ డ్, ప్రిన్సిపాళ్లు బిజ్జు, సుధాకర్ విద్యార్థులను అభినందించారు.

‘శ్రీ కృష్ణవేణి టాలెంట్’ విజయ కేతనం..
శ్రీ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు పదో ఫలితాల్లో విజయకేతనం ఎగురవేశారు. పది జీపీఏ సాధించిన వారిలో ఎస్. సాయి సదీక్షిత, పి.శ్రీయ, పి. లాస్య, ఎస్. శ్రీజని, వై. కావ్యశ్రీ, ఎం. భువన, పి.అక్షిత, ఎన్. నిశాంత్‌కార్తికేయ, కే. శ్రీ హాస్, ఎన్. ఆదిత్య సాధించారు. 49 మంది 9 జీపీఏకు పైగా సాధించారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను డీఈవో రమేశ్ కుమార్, ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, విద్యార్థులను అభినందించారు.

ఇంగ్లిష్ యూనియన్ విద్యార్థుల హవా..
పది ఫలితాల్లో ఇంగ్లిష్ యూనియన్ విద్యార్థులు హవా కనబర్చారు. వందశాతం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల్లో మహాలక్ష్మి (10), జోహా (10), మలిహా (10) జీపీఏ సాధించారు. వీరిని డీఈవో రమేశ్‌కుమార్ అభినందించారు. ఫలితాలపై కరస్పాండెంట్ రాజ్‌కుమార్ హర్షం వ్యక్తంచేశారు.

‘రేడియంట్’ విద్యార్థుల ప్రతిభ..
సూర్యాస్‌రేడియంట్ హైస్కూల్ విద్యార్థులు పదిలో వందశాతం ఫలితాలు సాధించడంతో కరస్పాండెంట్ మడుపు రాజు అభినందించారు. ఏ.జయకృష్ణ (10), ఎం.చంద్రశేఖర్‌రెడ్డి (10), ఎం.సందీప్‌కుమార్ (10) జీపీఏ సాధించారు. మరో ఎనిమిదిమంది విద్యార్థులు ఉన్నత గ్రేడింగ్‌తో మొత్తం ఇరవై మంది విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణ సాధించగా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

‘ఆక్స్‌ఫోర్డ్’ విద్యార్థులు..



చిలుక అనుష్క

ఎస్సెస్సీ ఫలితాల్లో ఆక్స్‌ఫోర్డ్ సైనిక్ హైస్కూల్ విద్యార్థులు సత్తాచాటా రు. చిలుక అనుష్క 10జీపీఏ సాధించగా..తల్లిదండ్రులు చిలుక సత్యనారాయణ, కావ్య దంపతుల ను పాఠశాల ప్రిన్సిపాల్ చిలుక కిరణ్‌కుమార్ అభినందించారు.

‘వివేకానంద’ విద్యార్థులు..
పదో తరగతి ఫలితాల్లో వివేకానంద విద్యానికేతన్ హైస్కూల్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. వి.అమూల్య, బి.పరిమల్ 10 జీపీఏ సాధించారు. బి. శ్రీనేహా (9.7), అభినవ్ (9.5) సాధించారు. వందశాతం ఉత్తీర్ణత రావడంపై విద్యార్థులను యాజమాన్యం దిడ్డి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ బుచ్చారావు, మహేందర్‌రెడ్డిలు అభినందించారు.

ఇళ్లపైనే వేలాడుతున్నాయి..



ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ తీగలు ప్రమాదకరంగా మారాయి. విద్యుత్ వైర్లు ఇళ్లను తాకుతున్నా సెస్ అధికారులు పట్టించుకోవడం లేదు. మండలకేంద్రంతోపాటు దుమాల గ్రామంలో విద్యుత్ వైర్లు ఇళ్లపైనే వేలాడుతున్నాయి. పలువురు విద్యుఘాతానికి గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. లూజ్‌గా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని పలుసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేయాలని కోరుతున్నారు.

బండి సంజయ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



రాచర్ల గొల్లపల్లిలో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ఇంటింటా చేరాయని, ఎన్నికల్లో బండి సంజయ్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని బీజేపీ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి రాజిరెడ్డి అన్నారు. మండలంలోని రాచర్ల గొల్లపల్లి, రాచర్ల బొప్పాపూర్‌లో మంగళవారం ఆయన బండి సంజయ్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు మద్దుల బుగ్గారెడ్డి, లక్ష్మారెడ్డి, దేవేందర్ రెడ్డి, కిరణ్‌నాయక్, మినహాజ్ ఖాన్, గణేశ్, పూర్ణిమ, శ్రీశైలం, కృష్ణహరి, శ్రీను, మధు, సత్యం రెడ్డి, సంజీవరెడ్డి, బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





మందుబాబులకు అడ్డాగా..

కోనరావుపేట: మండలంలోని పలు గ్రామాల్లో నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. మరిమడ్లలోని పల్లె ప్రకృతి వనంలో మందుబాబులు అడ్డా వేస్తున్నారు. ఊరికి దూరంగా నిర్మించడంతో పట్టించుకునేవారే కరువయ్యారు. దీంతో ప్రకృతి వనం చెత్తాచెదారంతో నిండిపోతుంది. ప్రధాన రహదారికి పక్కనే ఉన్న ఈ ప్రకృతి వనంలో మద్యంతాగి మందుబాబులు ఖాళీ సీసాలు అక్కడే పడేస్తున్నారు. మండలంలోని ఎగ్లాస్‌పూర్, కనగర్తి, వట్టిమల్ల, మామిడిపల్లి తదితర గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. పాలకులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

క్లుప్తంగా

నేడు మంత్రి పొన్నం పర్యటన

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలో బుధవారం మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకుళాభరణం శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అచ్చన్నపల్లి–చెక్కపల్లి గ్రామాల క్రాస్‌రోడ్డు వద్ద నిర్వహించే కార్యక్రమంలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ పాల్గొననున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ సిద్ధోగం



బూర్గుపల్లిలో బోనాలతో వెళ్తున్న మహిళలు

బోయినపల్లి: మండలంలోని బూర్గుపల్లి, వరదవెల్లి గ్రామాల గౌడ సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న ఎల్లమ్మ సిద్ధోగంలో భాగంగా మంగళవారం రాత్రి ఎల్లమ్మ బోనాలు తీశారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల మధ్య మహిళలు నెత్తిన బోనాలతో ఆలయానికి తరలివెళ్లారు. అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలు పండాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గౌడసంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: మండలంలోని మోహినికుంటలో ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎల్లమ్మ పట్నాలు వేశారు. ఎల్లమ్మ, జమదగ్ని కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవాల్లో గీత కార్మికులు, నాయకులు పాల్గొని పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



రుద్రంగి: ఓట్లు అభ్యర్థిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రుద్రంగి: కరీంనగర్ ఎంపీగా వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని కాంగ్రెస్ మండల నాయకులు మంగళవారం మండలకేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గట్ల మీనయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్‌రెడ్డి, డీసీసీ కార్యదర్శులు చెలుకల తిరుపతి, గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు ఎర్రం గంగనర్సయ్య, నారాయణ, గంగాధర్ పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎన్నికల ప్రచార కరపత్రాలను ఆ పార్టీ నాయకులు ఆవిష్కరించారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్ రావును గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి కోరారు. కాంగ్రెస్ నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, ఏలూరి రాజయ్య, కొండాపురం శ్రీనివాస్‌రెడ్డి, నంది కిషన్, బండారి బాల్‌రెడ్డి, భూమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కోరంలేక వాయిదా

వీర్నపల్లి: మండలంలో మంగళవారం నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశం కోరంలేక వాయిదాపడినట్లు ఎంపీడీవో సత్తయ్య తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు హాజరుకాకపోవడంతో వాయిదావేసినట్లు పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

తంగళ్లపల్లి: బీఆర్‌ఎస్ తంగళ్లపల్లి పట్టణ ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేసినట్లు పార్టీ సీనియర్ నాయకుడు నులుగొండ శ్రీనివాస్ మంగళవారం ప్రకటించారు. ఈ మేరకు బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్నకు రాజీనామా లేఖను పంపినట్లు పేర్కొన్నారు. వ్యక్తిగత కారణాలతోనే పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు లేఖలో తెలిపారు.

పదిలో ‘కృష్ణవేణి’ విద్యార్థుల ప్రతిభ



వంగ సాయిచరణ్

వేములవాడ: పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మంగళవారం వెలువడిన పదో తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో వంగ సాయిచరణ్ 10 జీపీఏ సాధించడంతో పాఠశాల యాజమాన్యం విద్యార్థిని అభినందించారు. ఇద్దరు 9.7 ఇద్దరు, 9.5, ఐదుగురు, 9.3, ఇద్దరు, 9.2, ఏడుగురు, 9.0 జీపీఏ సాధించినట్లు కరస్పాండెంట్ వెంకటకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, తల్లిదండ్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయంలో పూజలు

గంభీరావుపేట: మండలంలోని మల్లారెడ్డిపేట, లింగన్నపేటలో ఎల్లమ్మ ఆలయాల్లో (ఎల్లమ్మ) కరీంనగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బీజేపీ మండల అధ్యక్షుడు గంట అశోక్, జిల్లా అధికార ప్రతినిధి దేవసాని కృష్ణ, నాయకులు ఉన్నారు.